క్లుప్తంగా

నేడు ఉపాధి పనులపై ఓపెన్ ఫోరం

లింగాల: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనులపై ఓపెన్ ఫోరం నిర్వహించనున్నామని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులకు ఖర్చు చేసిన రూ.9.27 కోట్లకు సంబంధించి సోషల్ ఆడిట్ అధికారులు తనిఖీలు నిర్వహించనున్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనులను పరిశీలించి అందులోని లోటుపాట్లను బుధవారం జరిగే సోషల్ ఆడిట్‌లో వెల్లడించడం జరుగుతుందన్నారు. కూలీల వేతనాలకు సంబంధించి రూ.7.33 కోట్లు, మెటీరియల్ ఖర్చుకు సంబంధించి రూ.94 లక్షలు వ్యయం చేయడం జరిగిందన్నారు. పీడీ యదుభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

పశువులకు టీకాలు


పశువుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి మహమ్మద్ యూనస్

సింహాద్రిపురం: మండల పరిధిలోని బిదినంచర్ల పశువైద్య పరిధిలోని బిదినంచర్ల, గురిజాల గ్రామాలలో మంగళవారం పశువైద్యాధికారి మహమ్మద్ యూనస్ పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ఏడాదికి రెండు సార్లు పశువులకు టీకాలు వేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందుల వాడకంలో మెళకువలు పాటించాలి

ముద్దనూరు: పురుగు మందులు పిచికారి చేసే సమయంలో రైతులు మెళకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఉప్పలూరు గ్రామంలో పురుగు మందుల వాడకం, వాటి దుష్ప్రభావాలపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. పిచికారి సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని, విషపూరితమైన పురుగు మందులు వాడే సమయంలో ఎటువంటి అస్వస్థతకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ సూచించారు.

సచివాలయాల తనిఖీ


పాతసంగటిపల్లె సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ వెంకటసుబ్బయ్య

పెండ్లిమర్రి: మండలంలోని వెల్లటూరు, పాత సంగటిపల్లె గ్రామ సచివాలయాలను మంగళవారం డివిజనల్ అభివృద్ధి అధికారి వెంకటసుబ్బయ్య అకస్మీకంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం వెల్లటూరు హైస్కూల్‌ను తనిఖీ చేసి హైస్కూల్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీపతి, కిరణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అడవికి నిప్పు.. మనుగడకు ముప్పు

- అడవులకు నిప్పు పెట్టడంతో కాలి బూడిదవుతున్న అటవీ సంపద
- చోద్యం చూస్తున్న అటవీ శాఖ అధికారులు

వేంపల్లె: ఔషధ మూలికలు, ఫలాలు ఇచ్చే చెట్లు, అందులో నివసించే పలు వన్య ప్రాణులు, ఆహ్లాదాన్ని ఇచ్చే ప్రకృతి వెరసి పచ్చదనం పెంచే అడవులు పులివెందుల నియోజకవర్గానికే సొంతం. అయితే అలాంటి అటవీ సంపదకు నిప్పు పెట్టడంతో మానవాళి మనుగడకే ముప్పుగా పరిణమిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొంతమంది స్వార్థపరులు, ఆకతాయిల నుంచి వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన అడవులు కొందరి స్వార్థం, ఆకతాయిల వికృత చేష్టలకు బుగ్గిపాలవుతున్నాయి. వేసవి వస్తే అడవులకు నిప్పు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. పచ్చగడ్డి వస్తుందనే భ్రమతో అటవీ శివారు గ్రామాల్లో గొర్రెలు, మేకలు, పశుపోషకులు అడవులకు నిప్పు పెట్టడం షరా మామూలైంది. వర్షాలు కురిస్తే పచ్చగడ్డి వస్తుందనే మాట అటుంచితే తద్వారా అనేక అనర్థాలు, ముప్పు సంభవిస్తున్నట్లు ప్రకృతి ప్రేమికులు అంటున్నారు. అడవులకు నిప్పు పెట్టడంతో ఇక్కడున్న జీవ రాశులతోపాటు అటవీ ఫలాలు, ఔషధ గుణాలు కలిగిన చెట్లు మంటలలో మాడి మసైపోతున్నాయి.


ఇడుపులపాయ మారుతినగర్ అటవీ ప్రాంతంలో మంటలను ఆర్పుతున్న అటవీ అధికారులు.


బక్కన్నగారిపల్లెలో అగ్నికి ఆహుతైన అరటి తోట

- పులివెందుల నియోజకవర్గంలో సుమారు 125వేల హెక్టార్ల విస్తీర్ణంలో అడవులు ఉన్నాయి. అందులో వేంపల్లె, చక్రాయపేట, వేములలలో ఎక్కువ శాతం, తొండూరు, పులివెందుల, సింహాద్రిపురం, లింగాలలలో తక్కువ శాతం విస్తీర్ణంలో అడవులు ఉన్నాయి. ఇవి నిత్యం మంటలలో ఆహుతవుతున్నాయి. ప్రధానంగా వేంపల్లె, వేముల, ఇడుపులపాయ, బక్కన్నగారిపల్లె, టి.వెలమవారిపల్లె, నేలవరం తాండా తదితర ప్రాంతాలలో గ్రామాలతోపాటు పలు ప్రాంతాలలో ఉన్న అడవులు ఏటా కాలిపోతున్నాయి.

ఆందోళనలో సమీప గ్రామాల ప్రజలు, రైతులు

అడవులకు నిప్పు పెడుతుండటంతో అడవికి సమీపంలోని పంట పొలాలు అగ్నికి ఆహుతవుతున్నాయి. అటవీ సమీప గ్రామాల్లోని తాండా ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- గతంలో టి.వెలమవారిపల్లె గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతానికి నిప్పు పెట్టడంతో పక్కనే ఉన్న ఎస్.రవిశంకర్‌రెడ్డి అనే రైతుకు సంబంధించిన 3 ఎకరాల అరటి తోట కాలిపోయి నష్టాలపాలైనట్లు బాధిత రైతులు ఆవేదన చెందారు.
- ఇటీవల వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లె గ్రామ సమీపంలో అడవికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గ్రామానికి చెందిన పి.మహేశ్వర రెడ్డి, రమణారెడ్డిలకు చెందిన 7 ఎకరాల అరటి, చీనీ చెట్లు కాలిపోయాయి.
- అడవులకు అగ్గి పెట్టడంతో నిప్పులు ఎగిసిపడి సమీపంలో ఉన్న నేలవరం తాండా, మారుతి నగర్ తదితర గ్రామాలు పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో 40 గొర్రెలు కూడా మంటలలో సజీవ దహనమయ్యాయి.

ప్రజలలో చైతన్యం తీసుకురావాలి..



అడవులకు నిప్పు పెట్టడంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. పచ్చని అడవులు ఉంటే వాతావరణం చల్లగా ఉండటమేకాక వర్షాలు కూడా బాగా కురుస్తాయి. అడవులను రక్షించేందుకు ప్రభుత్వం కోట్లు వెచ్చిస్తున్నా.. ఇలా కాలిబూడిద పాలవ్వడం విచారకరం. – ఎస్.రవిశంకర్‌రెడ్డి(రైతు), టి.వెలమవారిపల్లె

అధికారులు అలసత్వం వహించడం బాధాకరం..



అడవులకు నిప్పు పెట్టకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అలసత్వం వహించడం బాధాకరం. అసలు అటవీ సిబ్బంది ఎప్పటికప్పుడు అడవులలో పర్యటించే విధంగా చర్యలు తీసుకోవాలి. తద్వారా అనేక నష్టాలు సంభవించకుండా ఉంటాయి. అటవీ సంపద నాశనమవుతున్నా అధికారులలో చలనంలేదు. – వి.ప్రదీప్‌కుమార్‌రెడ్డి(రైతు), అలిరెడ్డిపల్లె

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..



అడవులను సంరక్షించుకోవడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అడవులకు నిప్పు పెట్టడం చట్టరీత్యా వ్యతిరేకమని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎప్పుడైనా అడవులకు నిప్పు పెడుతున్నట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకంటామని హెచ్చరించడం జరిగింది. అంతేకాక టోల్‌ఫ్రీ నెంబర్ 9000550708 అనే ఫోన్ నెంబర్ కాల్ చేయాలని సూచించాం. ప్రజలలో చైతన్యం తీసుకొస్తామని వారు కూడా తమకు సహకరించాలని కోరాం. – పి.బాలసుబ్రమణ్యం(ఫారెస్ట్ రేంజ్ అధికారి), వేంపల్లె

స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తులు చేసుకోండి

తొండూరు : మండల కేంద్రమైన తొండూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పీఎంకేవీవై పథకం కింద ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ సర్వేయర్, ఫోర్ వీలర్ సర్వీసెస్ అసిస్టెంట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ స్వల్పకాలిక కోర్సులలో శిక్షణ ఇస్తున్నామని.. ఈ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సులలో చేరడానికి పదవ తరగతి పాసై 15 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండి నిరుద్యోగ యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 25వ తేదీలోపు వారి సర్టిఫికెట్లతోపాటు ఆధార్ కార్డు, కలర్ ఫొటో తీసుకుని తొండూరు ప్రభుత్వ ఐటీఐలో తమ పేర్లను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈ కోర్సులలో చేరే వారికి ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మరిన్ని వివరాలకు 9989956928, 8639191848 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

జమ్మలమడుగు : ప్రభుత్వ ఐటీఐలో మూడునెలల పాటు స్వల్పకాలిక శిక్షణకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని మైలవరం, జమ్మలమడుగు ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాల్స్ మత్తేశులు, నవరూప్‌కుమార్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌసల్య విద్య యోజన పథకం ద్వారా తదితర కోర్సుల కోసం అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 25వ తేదీలోపు సర్టిఫికెట్లతోపాటు ఆధార్‌కార్డు, కలర్ ఫొటో తీసుకుని వచ్చి ఐటీఐలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

అటవీ ప్రాంతంలో వ్యాపించిన మంటలు

ముద్దనూరు: ముద్దనూరు–పులివెందుల రహదారిలోని స్థానిక ఘాట్‌రోడ్డులో మంగళవారం అటవీ ప్రాంతంలో మంటలు వ్యాపించాయి. సాయంత్రం 4 గంటలనుంచి అడవిలో వ్యాపించిన మంటలు రాత్రి వరకు కొనసాగుతూనే వున్నాయి. ఎండ తీవ్రతతోనే మంటలు వ్యాపించివుంటాయని తమ సిబ్బంది మంటలను అదుపుచేస్తున్నారని అటవీశాఖాధికారులు తెలిపారు.

ప్రణాళికతో చదివితే ఒత్తిడి దూరం

పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల టౌన్ : ప్రణాళికతో చదివితే పరీక్షలలో మానసిక ఒత్తిడి ఉండదని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ ఉన్నత పాఠశాల, బ్రాహ్మణపల్లె ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు కెనడా దేశానికి చెందిన ఓటీఎఫ్ ఆర్గనైజేషన్ సహకారంతో స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో పరీక్షా సమగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పరీక్షలు అనే భయం వీడాలని, ప్రణాళికతో చదివితే పరీక్షలపై మానసిక ఒత్తిడి ఉండదన్నారు. ప్రతి విద్యార్థిని ఉన్నత చదువులతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం ఎంఈఓ వీరారెడ్డి మాట్లాడుతూ ప్రశాంతమైన మనసుతో పరీక్షలకు హాజరైతే విజయం మీ సొంతమన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షా సాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రాజు, హెడ్మాస్టర్ పద్మావతమ్మ, ఉపాధ్యాయులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.


విద్యార్థినికి పరీక్షా సామగ్రిని పంపిణీ చేస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

రైతు భరోసా కేంద్రాల్లో పంటనమోదు జాబితా

వీరపునాయునిపల్లె : రబీ 2022–23కు సంబంధిచిన పంట నమోదు జాబితాను మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. మంగళవారం అనిమెల రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రబీకి సంబంధించి మండల వ్యాప్తంగా 4,605 మంది రైతులకు గాను 16,165 ఎకరాలలో పంట నమోదు చేయడం జరిగిందని 99.7 శాతం మంది రైతులకు ఈకేవైసీ పూర్తి చేశామన్నారు. సామాజిక తనిఖీ నిమిత్తం ఈనెల 17వ తేదీ వరకు పంట నమోదు వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించడం జరిగిందని జాబితాలో పొరపాట్లు ఉన్నాయని గుర్తించిన రైతులు అభ్యంతరాలు తెలియజేస్తే వారి నుంచి దరఖాస్తు తీసుకుని సరిదిద్దడం జరుగుతుందని తెలిపారు. రైతులు వారికి సంబంధించిన రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అనిమెల రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


అనిమెల రైతు భరోసా కేంద్రంలో పంటనమోదు జాబితాను పరిశీలిస్తున్న రైతులు

ఫొటోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్స్‌లో ఉచిత శిక్షణ

కడప కార్పొరేషన్ : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ , వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్స్, సర్వీసింగ్(30రోజులు), సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్(13 రోజులు) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎన్. నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల చెందిన యువకులకు ఈనెల 16 నుంచి శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 18–45 ఏళ్లలోపు వయసు కలిగిన నిరుద్యోగ యువకులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల వారు ట్రైనింగ్ సెంటర్ ఈ మెయిల్‌కు వివరాలు పంపవచ్చన్నారు. వివరాలకు 9440905478, 6302833548 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాల ఏర్పాటు

పులివెందుల టౌన్ : నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పులివెందుల పట్టణంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, వైఎస్ వీఆర్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాయి చైతన్య జూనియర్ కళాశాల, నారాయణ కళాశాలలను ఏర్పాటు చేశారు. మొత్తం 953 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వైఎస్‌వీఆర్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్ విద్యార్థులు 266 మంది, ఒకేషనల్‌కు సంబంధించి 81మంది కలిపి మొత్తం 347 మంది, అలాగే నారాయణ కళాశాలలో 183 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 239 మంది, సాయిచైతన్య జూనియర్ కళాశాలలో 184 మంది పరీక్షలు రాయనున్నారు. అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. పరీక్షా సమయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు ఉంటుందన్నారు. విద్యార్థులందరూ 8.20 గంటలకు పరీక్షా కేంద్రాలకు హాజరు కావాలని.. 8.30 గంటలకు పరీక్షా బుక్‌లెట్, ఓఎంఆర్ సీటు అందిస్తారని విద్యా శాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులు సమయపాలన పాటించి సమయానికి చేరుకోవాలని వారు తెలిపారు.


పులివెందులలోని వైఎస్‌వీఆర్ఎం కళాశాలను పరిశీలిస్తున్న విద్యా శాఖ అధికారులు

కమలాపురం : స్థానిక గురుకుల పాఠశాలతోపాటు పీవీఎస్ఆర్ఎం జూనియర్ కాళాశాలలో బుధవారం నుంచి నిర్వహించే ఇంటర్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. అలాగే పెండ్లిమర్రి మండలంలో ఒక్క పరీక్షా కేంద్రంలో ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం మూడు కేంద్రాల్లో ఫస్ట్ ఇయర్ పరీక్షలు 595 మంది, సెంకడియర్ పరీక్షలు 615 మంది మొత్తం 1220 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. గురువారం నుంచి సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో అన్ని గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని అరగంట ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని వారు తెలిపారు. గురుకుల పాఠశాల కేంద్రంలో ఫస్ట్ ఇయర్‌కు చెందిన 253 మంది, సెకండియర్‌కు చెందిన 228 మంది పరీక్షలు రాయనున్నారు. పీవీఎస్ఆర్ఎం జూనియర్ కళాశాల కేంద్రంలో ఫస్ట్‌ఇయర్‌కు చెందిన 223 మంది, సెకండియర్‌కు చెందిన 262 మంది పరీక్షలు రాయనున్నారు. పెండ్లిమర్రిలోని పరీక్షా కేంద్రంలో ఫస్టియర్‌కు చెందిన 119 మంది, సెకండియర్‌కు చెందిన 125 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

ఎర్రగుంట్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ కె.త్రివిక్రమరెడ్డి తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 170 మంది, ద్వితీయ సంవత్సరంలో 224 మంది హాజరవుతారన్నారు. పరీక్ష గదులలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.

జమ్మలమడుగు : బుధవారం నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాలలోని విద్యార్థులకు జమ్మలమడుగు పట్టణంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షా కేంద్రాలలో మొత్తం 955 మంది ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కొండాపురం, ముద్దనూరు మండలాలోని విద్యార్థులకు ముద్దనూరు సెంటర్‌లో 145 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్దల 144 సెక్షన్ ఉంటుందన్నారు.

వేంపల్లె : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మెయిన్ బజార్‌లోని ఉర్దూ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షను 376 మంది విద్యార్థులు రాయనున్నారు. గురువారం జరిగే ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షను 327 మంది విద్యార్థులు రాయనున్నారు.

లయోలా పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

పులివెందుల టౌన్ : ఈనెల 11, 12వ తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన నాల్గవ సౌత్ ఇండియా జోనల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్‌లో పులివెందుల లయోలా పాలిటెక్నిక్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ బ్రిట్టో తెలిపారు. మంగళవారం స్థానిక లయోలా పాలిటెక్నిక్ కళాశాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్‌లో కమలాకర్ ప్రథమ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో దినేష్‌కుమార్, లాంగ్ జంప్‌లో బానుప్రకాష్ రెడ్డి ద్వితీయ స్థానాలలో నిలిచారన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ విజయరాజు, కళాశాల పీఈటీ గంగాధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు

నులి పురుగులను నివారిద్దాం

జాతీయ నులిపురుగుల నివారణదినోత్సవంలో అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలి

వల్లూరు: నులి పురుగుల వలన రక్త హీనత వస్తుందని వీటిని నివారిద్దాం అని అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో మంగళవారం 19 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు మాత్రలను తినిపించి ప్రారంభించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఫణీంద్ర, సీహెచ్ఓ వేణుగోపాల్‌రావు, హెల్త్ సూపర్ వైజర్ శివరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు నులి పురుగుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సాయిలీల విద్యార్థులకు నులి పురుగుల నివారణా మందులను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరు భోజనం ముందు, తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధారాణి, డాక్టర్ విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం: మండల పరిధిలోని చవ్వారిపల్లె, పైడిపాలెం, సుంకేసుల, నంద్యాలంపల్లె, రావులకొలను, సింహాద్రిపురం, తెలికి గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు మంగళవారం డాక్టర్లు కుమార్, హుస్సేన్‌లు నులిపురుగుల నివారణా మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ కృష్ణమూర్తి పర్యవేక్షించారు. సింహాద్రిపురం పీహెచ్‌సీ పరిధిలో 2735, బిదినంచర్ల పీహెచ్‌సీ పరిధిలో 1047 మంది విద్యార్థులకు మాత్రలు మింగించారు. మిగిలిన విద్యార్థులకు ఈనెల 18వ తేదీలోపు మింగించాలని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ వెంకటేశ్వర్లు, సీహెచ్ఓలు పవిత్ర, దిల్షాద్, ఏఎన్ఎం లక్ష్మీప్రసన్న, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


వల్లూరులో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలి


తొండూరులో నులిపురుగుల నివారణా కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ, తదితరులు


ఎర్రగుంట్ల పీహెచ్‌సీలో సిబ్బందితో కమిషనర్ జగన్నాథ్

వేంపల్లె: స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణా మందులను పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. మంగళవారం ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో నులి పురుగుల నివారణపై అవగాహన కల్పిస్తూ దాదాపు 280 మంది విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే తాళ్లపల్లె పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా బేగం మంగళవారం తాళ్లపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణాపై అవగాహన కల్పించి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం దస్తగిరి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లి, మూలవంక గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి. రవికుమార్‌రెడ్డి, ఎంఈఓ వెంకటరామిరెడ్డి, వైద్యులు రాఘవేంద్ర, సూపర్‌వైజర్లు మోహన్‌రెడ్డి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

తొండూరు : స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అగన్‌వాడీ కేంద్రాలలో ఎంపీడీఓ విష్ణుప్రసాద్ విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో నులిపురుగుల నివారణకు చెందిన వాల్ పోస్టర్లను ఆరోగ్య సిబ్బందితో కలిసి విడుదల చేశారు. మండల వ్యాప్తంగా 2622 మంది పిల్లలకు మందులు వేయాల్సి ఉండగా.. 2520 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సూపర్‌వైజర్ శశికళ, గ్రామ ఆరోగ్య కేంద్రాల కమ్యూనిటీ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరు: మండలంలోని రామనపల్లి, రాచిన్నాయపల్లె ప్రైమరీ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన నూలిపరుగురుల నివారనోత్సవ కార్యక్రమాలను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి పరిశీలించి మాట్లాడారు. మండలంలో 43 ప్రభుత్వ, 8 ప్రైవేటు పాఠశాలలు, 52 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 6,693 మంది పిల్లలు ఉన్నారని, వీరిలో 6,104 మంది పిల్లలకు మాత్రలను మింగిచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీకృష్ణ, ఎంపీడీఓ గంగనపల్లి సురేష్‌బాబు, ఎంఈఓ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్: మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషయన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు తస్మియా, ఈశ్వరయ్యలు మాట్లాడుతూ విద్యార్థులు భోజనము చేసే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని వారు తెలిపారు. కార్యక్రమంలో 104 సూపర్‌వైజర్ వి.మహేష్ పైలట్ అశోక్, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని 5,600 మంది పిల్లలకు నూలిపురుగుల నివారణ మాత్రలను మంగళవారం పట్టణ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ పంపిణీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ జ్యోత్స్న, హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.